క్లుప్తంగా

నేడు భీమవరపుకోటలో మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గ్రామంలో జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు గంగంపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

గోకవరం: మండలంలోని గంగంపాలెంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోటనందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ బి.నాగరత్నం సోమవారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారన్నారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



కిర్లంపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడి ఏనుగువీధిలో రామాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

15న లక్ష బిల్వార్చన

కిర్లంపూడి: జగపతినగరంలోని గౌరీశంకరుల ఆలయం ప్రాంగణంలో ఈ నెల 15న అయ్యప్పస్వామి వారికి లక్షబిల్వార్చన, పడిపూజ నిర్వహించనున్నట్టు అయ్యప్ప భక్తి మండలి సభ్యులు సోమవారం తెలిపారు. బ్రహ్మశ్రీ శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ లక్ష బిల్వార్చన నిర్వహిస్తారన్నారు. అధిక సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా చిన్ని



పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారి చిన్నిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోకవరం: పీఎంపీ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా కోశాధికారిగా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన పి.చిన్ని నియమితులయ్యారు. ఆయన గతంలో గోకవరం, కోరుకొండ, ఏజెన్సీ మండలాల అధ్యక్షుడిగా నాలుగుసార్లు పని చేశారు. కోశాధికారిగా నియమితులైన చిన్నిని పీఎంపీ మండల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు అభినందించి శాలువా, పూలమాలతో సత్కరించారు.

అభయ్ క్షేత్రానికి వంట పాత్రలు అందజేత



అభయ్ క్షేత్రానికి శివారెడ్డి అందజేసిన వంటపాత్రలు

జగ్గంపేట: గ్రామంలో శశి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభయ్ క్షేత్రానికి స్థానిక ఎస్ఎస్ కన్సల్టెంట్స్ ఇంజినీర్ శివారెడ్డి రూ.24 వేల విలువైన వంట పాత్రలు అందజేశారు. అభయ్ క్షేత్రం నిర్వాహకులు, శశి చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ నరసింహరావుకు సోమవారం వీటిని అందించారు. అభయ్ క్షేత్రంలో వృద్ధులు, పిల్లలకు ప్రతిరోజూ భోజన సౌకర్యం కల్పిస్తున్నామని నరసింహరావు తెలిపారు.

అన్నదాతకు కొండంత అండ

- రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం రూ.53.12 కోట్లు జమ
- సాగుదారులకు ప్రయోజనం
- ఐదేళ్లలో రూ.305 కోట్లు లబ్ధి



కోటనందూరులో ఖరీఫ్ పంటకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

తుని రూరల్: ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా ఐదో సంవత్సరం రైతు భరోసా పథకాన్ని అమలు చేశారు. ఈ ఏడాది రెండో విడత ఆర్థిక సాయాన్ని ఇటీవల రైతులు ఖాతాల్లో జమ చేశారు. ఏడాదికి రూ.13,500 చొప్పున రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. ఖరీఫ్ పనులు చేపట్టేందుకు అనువుగా మొదట విడతగా రూ.7,500, ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణకు రెండో విడతగా రూ.4 వేలు, మూడో విడతలో రూ.2 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ సంవత్సరం మొదట విడతలో రూ.7,500, రెండో విడతగా రూ.4 వేలను విడుదల చేయగా మూడో విడతగా రూ.2 వేల చొప్పున జనవరిలో రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 94,810 మంది సాగుదారులకు రూ.305 కోట్ల మేరకు రైతు భరోసా పథకంలో ప్రయోజనం కలుగుతోంది. ఈ సంవత్సరం మూడు నియోజకవర్గాల్లో 94,535 మంది రైతులకు రూ.53.12 కోట్లు లబ్ధి చేకూరింది.

రైతు ప్రయోజనాలకు పెద్దపీట

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారు. రైతు భరోసా కొనసాగిస్తూనే పంట రుణాలు, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ యంత్ర సేవా పథకం, వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం, జగనన్న పాల వెల్లువ వంటి పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్నారు. దీంతో సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరికీ అందించడంలో క్షేత్ర స్థాయి, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు.

మూడు నియోజకవర్గాలలో ఐదేళ్లలో లబ్ధి పొందిన రైతుల వివరాలు

నియోజకవర్గం	రైతుల సంఖ్య	ఐదేళ్లలో లబ్ధి	ఈ ఏడాది లబ్ధి
తుని	31,228	రూ.97.86 కోట్లు	రూ.17.56 కోట్లు
ప్రత్తిపాడు	36,060	రూ.118.83 కోట్లు	రూ.20.23 కోట్లు
జగ్గంపేట	27,522	రూ.88.35 కోట్లు	రూ.15.33 కోట్లు
మొత్తం		రూ.305.04 కోట్లు	రూ.53.12 కోట్లు

ఏటా పెట్టుబడి సాయం



మా కుటుంబానికి మూడెకరాల భూమి ఉంది. ఈ సంవత్సరం రెండు విడతలు రైతు భరోసా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం రైతు భరోసా నిధులు జమవుతున్నాయి. పెట్టుబడి సాయం అందిస్తూ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది.

– కె.కొండయ్యనాయుడు, రైతు, సుభద్రయ్యమ్మపేట, తుని మండలం

రైతు భరోసా నిధులు విడుదల



ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్నారు. అధికారం చేపటిన తర్వాత హామీని పక్కన పెట్టకుండా ఐదేళ్లుగా రైతు భరోసా సాయం విడుదల చేస్తున్నారు. ఈ సంవత్సరం ఇప్పటికే రెండు విడతలు రైతు భరోసా నిధులు విడుదల చేశారు.

– చోద్రాజు రాంబాబురాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, తుని

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. వనదుర్గ అమ్మవారి ఆలయం దిగువన నిర్మించిన మండపంలో ఈ హోమం నిర్వహించడం విశేషం. ఈ హోమ మండపాన్ని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులతో పాటు మరో 20 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టిశివ, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు దత్తాత్రేయశర్మ, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వన దుర్గ ఆలయ పరిచారకులు ఫణి శర్మ తదితరులు హోమం నిర్వహించారు.

సామాజిక సాధికారితకు పెద్దపీట

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- 23న ప్రత్తిపాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారితకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడులో ఈ నెల 23న జరిగే సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతంపై మండలంలోని ధర్మవరంలో నియోజకవర్గస్థాయి పార్టీ శ్రేణులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాలకూ సామాజిక న్యాయం జరిగిందన్నారు. తమ ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా బస్సుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 23న ప్రత్తిపాడులో నిర్వహించే బస్సుయాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మంత్రులు సీదిరి అప్పలరాజు, బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలం సురేష్, చెల్లుబోయిన వేణు, పినిపే విశ్వరూప్, దాడిశెట్టి రాజా, ఎంపీలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు నీరుకొండ రామకుమారి, తురుం మల్లేశ్వరి, బెహరా రాజేశ్వరి, గొల్లు చినదివాణం, ఎంపీపీలు పర్వత రాజబాబు, గోళ్ల కాంతిసుధాకర్, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, అడపా పార్థసారథి, రామిశెట్టి చినబాబు, శిడగం వెంకటేశ్వరరావు, పంచాది వీరబాబు, జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానం



కుమ్మరిలోవ తపోవనంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి



ప్రత్తిపాడులో తీర్చిదిద్దిన రంగవల్లి

- వైభవంగా దీపావళి వేడుకలు
- బాణసంచా కాల్పులతో మార్మోగిన పల్లెలు

ఏలేశ్వరం/తుని/ప్రత్తిపాడు/తునిరూరల్/తొండంగి/శంఖవరం/గండేపల్లి/కోటనందూరు: చీకట్లను పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండగను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ప్రజలు ఆదివారం రాత్రి వైభవంగా జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు బాణసంచా కాల్చి సందడి చేశారు. మహిళలు ప్రమిదలతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లోని పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి దివిటీలు కొట్టారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకూ బాణసంచా కాల్పులతో పల్లెలు మార్మోగాయి. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకపోవడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషాలంకరణ చేసి లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. ఎస్.అన్నవరం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా దీపాలంకర సేవ నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



అల్లిపూడి కేజీబీవీలో బాణసంచా కాల్చుతూ సందడి చేస్తున్న విద్యార్థినులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. జగ్గంపేట అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగుపూడిలో కొండమహంతి అప్పలరాజు అనే మహిళకు చెందిన పెంకుటిల్లుకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుని మంటలు ఎగసి పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు లక్ష్మణరావు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో సోమవారం రెండు తాటాకిల్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే... నీలాద్రిరావుపేటలోని సిద్దబత్తుల వీరభద్రరావుకు చెందిన పూరిపాకకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో నిత్యావసర వస్తువులు కాలిబూడిదయ్యాయి. రూ.80,000 ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ఈ ఇంటికి సమీపంలో ఉన్న సిద్దాబత్తుల కాంతం పూరిల్లుకు మంటలు వ్యాపించి పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో రూ.30,000 ఆస్తినష్టం వాటిల్లింది. ఇదే ప్రమాదంలో సిద్దాబత్తుల సోమరాజుకు చెందిన మోటార్ సైకిల్ పాక్షికంగా దెబ్బతింది. స్థానికుల సమాచారంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరకుని మంటలను అదుపు చేశారు.

రైల్వే యార్డులో మృతదేహం లభ్యం

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని యలమంచిలి రైల్వే యార్డులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడి బ్యాగులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కోటనందూరు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన మజ్జి బాబూరావు (40)గా గురించామన్నారు. ప్లాట్‌ఫాం నుంచి జారిపడడంతో తలకు తీవ్రగాయమై మృతి చెందాడని చెప్పారు. కేసు నమోదు చేసి మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు.

లారీని ఢీకొట్టిన కారు



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం కారు అదుపు తప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టి పొలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా త్రుటిలో ప్రాణనష్టం తప్పింది. వివరాల్లోకి వెలితే... రాజమహేంద్రవరంలోని జాంపేటకు చెందిన ఓ కుటుంబం విశాఖపట్నంలోని తమ బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. విశాఖ నుంచి తిరిగి వస్తుండగా మండలంలోని మల్లేపల్లి శివారుకు వచ్చే సరికి కారు అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని కారు ఢీకొట్టి రహదారి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ రియాన్, ఆస్య బేగం, హనీ, హయాన్‌కు స్వల్ప గాయాలుకాగా మార్య బేగంకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రోడ్డు సేఫ్టీ వాహనంలో రాజానగరం జీఎస్ఎస్ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథయాత్ర



ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామి రథయాత్ర

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో సోమవారం యాదాద్రి దేవస్థానం విజన్ ట్రస్ట్ ఆధ్వర్యాన వేంకటేశ్వరస్వామి రథయాత్ర వైభవంగా జరిగింది. గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, సీతారాముల ఆలయం వద్ద రథయాత్రను ఉంచి భక్తులకు దర్శనాలను కల్పించారు.

రాష్ట్రంలోని 500 శ్రీవారి ఆలయాల సందర్శనలో భాగంగా ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించినట్టు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్తికం.. కమనీయం

- రత్నగిరిపై కార్తిక మాసోత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్
- పశ్చిమ రాజగోపురం ఎదురుగా భారీ విశ్రాంతి షెడ్డు ఏర్పాటు



రత్నగిరిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్



పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిర్మించిన విశ్రాంతి షెడ్డు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కార్తికమాస సందడి నెలకొంది. సోమవారం మధ్యాహ్నం నుంచి కార్తిక మాసం ప్రారంభమవ్వడంతో రత్నగిరిపై అనివేటి మండపంలో పండితులు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపాన్ని ధ్వజస్తంభానికి వేలాడదీశారు.

ఏర్పాట్లు పూర్తి

కార్తికమాసంలో సత్యదేవుని సన్నిధికి వచ్చే వేలాది మంది భక్తుల కోసం వ్రతమండపాలు, దర్శనం క్యూలైన్లు, భక్తుల వసతి తదితర ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. సోమవారం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం పలు నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఈఈ నర్సింహరెడ్డి, డీఈలు, ఏఈఓలు, ఇతర అధికారులు, వ్రతపురోహితులు

ఏర్పాట్లు ఇలా..

ఈ ఏడాది కార్తిక మాసంలో సుమారు 1.60 లక్షలు వ్రతాలు జరిగే అవకాశం ఉందనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. రత్నగిరిపై జరిగే వ్రతాలలో దాదాపు 80 శాతం రూ.300 టిక్కెట్ వ్రతాలే భక్తులు ఆచరిస్తున్నారు. ఆ వ్రతాలకు మండపాలు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయి. దాంతో పర్వదినాల్లో భక్తులు వ్రతాలాచరించేందుకు ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంతో పాటు, మరో రెండు ఇతర మండపాలను ఏర్పాటు చేయనున్నారు.

పర్వ దినాల్లో ఒంటి గంట నుంచే వ్రతాలు

రూ.1500, రూ.2 వేలు వ్రతాలాచరించే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకేసారి అన్ని వ్రతమండపాల్లో వ్రతాలు నిర్వహిస్తే సుమారు 1,400 వ్రతాలు జరుగుతాయి. పర్వదినాల్లో అర్ధరాత్రి ఒంటి గంటకు వ్రతాలు మొదలవుతాయి. ఇతర దినాల్లో తెల్లవారుజాము నాలుగు గంటలకు వ్రతాలు ప్రారంభమవుతాయి. పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిర్మించిన నూతన విశ్రాంతి షెడ్డులో రూ.300 దర్శనం టిక్కెట్లు కౌంటర్, ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేస్తారు. రూ.300 దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు ప్రత్యేక కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉండాలి. స్వామివారి ఆలయం వద్ద ఖాళీ సమయాన్ని బట్టి వారిని ప్రత్యేక క్యూ లైన్ ద్వారా ఆలయానికి పంపిస్తారు.

మల్టీలెవిల్ పార్కింగ్ వరకే వాహనాలు

స్వామివారి ఆలయానికి వచ్చే వాహనాలను ప్రకాష్ సదన్ వెనుక స్థలం, దాని వెనుక గల మల్టీలెవిల్ పార్కింగ్ వరకూ మాత్రమే అనుమతిస్తారు. దేవస్థానం బస్సులు కూడా అక్కడి వరకే వస్తాయి. భక్తులు వ్రతం, దర్శనం చేసుకుని మరలా అక్కడికే రావాలి.అక్కడ నుంచి ఆదిశంకర మార్గ్ ద్వారా రెండో ఘాట్‌రోడ్‌కు అక్కడ నుంచి దిగువకు వెళ్లాలి. వీఐపీలు, సత్రాల్లో బస చేసే భక్తుల వాహనాలను టీటీడీ స్థలం పక్క నుంచి నిర్మిస్తున్న రోడ్ ద్వారా దిగువకు వెళ్లేలా అనుమతిస్తారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ

సత్యదేవుని దర్శనం చేసుకున్న భక్తులకు అన్నదాన పథకం హాలు వద్ద పులిహోర, దద్ధోజనం పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం సాంబారు అన్నం, కదంబం పంపిణీ చేస్తారు. సత్రాల్లో వసతి లభించని భక్తులకు కొండదిగువ ఏర్పాటు చేసిన షెడ్లలో విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. అక్కడ అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం పాత సీఆర్వో కార్యాలయం వద్ద కేశఖండనశాల ఏర్పాటు చేస్తున్నారు.



విద్యుత్ కాంతుల నడుమ తేటగుంట శివాలయం

ఆలయాలకు కార్తిక శోభ

తుని రూరల్: మండలంలోని శివాలయాలకు కార్తిక శోభ సంతరించుకుంది. మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తేటగుంట, టి.తిమ్మాపురం, హంసవరం, చామవరం, జగన్నాథగిరిలోని శివాలయాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కుమ్మరిలోవ తపోవనంలో ప్రత్యేక పూజలు చేసేందుకు పీఠాధిపతి, వేదపండితులు, వేద విద్యార్థులు ఏర్పాట్లు చేశారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన లక్ష్మీదేవి పుష్కరిణిని మంగళవారం ప్రారంభించేందుకు ధర్మకర్తలు సర్వం సిద్ధం చేశారు. పుష్కరిణి నిర్మించిన తర్వాత తొలి కార్తికమాసం కావడంతో నీటి వసతులతో పాటు భద్రతాపరమైన చర్యలు తీసుకున్నారు.

గండేపల్లి: కార్తికమాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం తాళ్లూరు, గండేపల్లి, నీలాద్రిరావుపేట, ఉప్పలపాడు, మురారి, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు ఆకాశదీపం పూజలు నిర్వహించారు.



వాహనాల రాకపోకలకు సిద్ధమైన ఆదిశంకర మార్గ్ రోడ్డు